11.4.1997 శుక్రవారం 12 పేజీలు సంపుటి:69 సంచిక:15 విడిప్రతి రూ.2.00లు Phone: 27354 Regd. No. HNL 18


# జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి





నిర్మల వక్కపొడి

మ్యానుఫ్యాక్చరింగ్ కంపెని - నెల్లూరు. A.P.

1 రూపాయి P.T. వక్కపొడి రుచి చూడండి

Phones : STD : 0861 - 23795; 23796; 24796.


# చంద్రబాబుకివి భలే మంచిరోజులు!



ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడి రాజకీయ జాతకం మహర్దశలో నడుస్తూంది. ఆయనేది తలపెట్టినా నల్లేరుపై బండి వలె నడిచి పోతూంది. ఇటీవలి కాలంలో ఏ ఆంధ్ర ముఖ్యమంత్రి కూడా ఇంత సంతోషంగా గడప లేదనడం నిజం.

వాస్తవానికి చంద్రబాబు తీసుకొన్న నిర్ణయాల ప్రభావం ఆయన్ను ఇప్పుడు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టి వుండాలి; ప్రజలలో తీవ్రమైన అలజడికి కారణ భూతమై వుండాలి. కాని పరిస్థితి అందుకు విరుద్ధంగా వుంది. మద్యపాన నిషేధం ఉత్తర్వును రద్దు చేయడాన్ని జనమింత నిశ్శబ్దంగా స్వీకరిస్తారని ఆయనా వూహించ లేదు. చెదరు మదరుగానైనా దీనిపై అలజడి రేగుతుందనే భావించారు. అయితే కాంగ్రెస్, బిజెపి పార్టీలు లాంఛన ప్రాయంగా ఒక బంద్ జరిపి, ప్రక్కకు తప్పుకోవడంతో ఇంక దానిపై ఉద్యమం నడిపేవారే కరవయ్యారు. కమ్యూనిస్టులతో ఎప్పుడో ఒప్పందం కుదిరి పోయింది కాబట్టి - వారి చీకాకు లేదు. కడుపు నిండా చెరువు నీరు త్రాగించి రామోజీ రావును బొజ్జో పెట్టేశారు. తతిమా దినపత్రికలకూ తాయిలాలు పడిపోయాయి. ఒకవేళ ఎక్కడైనా మహిళలు చిన్నపాటి నిరసన తెల్పినా, అది ప్రక్క వూరికి కూడా తెలియకుండా వార్తలు తొక్కి పెట్టేసి తమ స్వామిభక్తి చాటుకుంటున్నది ఈనాడు పత్రిక.

ఈ ఉద్యమం నీరుగారి పోవడం చంద్ర బాబుకు పెద్ద రిలీఫ్. ఈ సమయంలోనే ఆయనకు ప్రపంచ బ్యాంకు నుంచి ఆర్థిక సహాయం మంజూరైనట్లు వాషింగ్టన్ నుంచి వార్త వచ్చింది. బీటలు వారిన మాగాణీ భూమిపై వర్షపు చినుకులు పడినంత సంబరం కల్గించే వార్త అది. ఆ డబ్బు చేతి కందితే రానున్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వెతుకులాట వుండదు. నీటి పారుదల ప్రాజెక్టులు, విద్యుత్ కేంద్రాలు సజావుగా నడుస్తాయి. ఆ డబ్బు అందిందన్న ధైర్యంతోనే జన్మభూమి పథకానికి వెయ్యి కోట్లు కేటాయించారు ముఖ్య మంత్రి. జన్మభూమి పథకం తెలుగు దేశం జెండా నీడన జరిగే ప్రచారార్భాటం. అందువల్ల గ్రామ గ్రామంలో తన పార్టీ కార్యకర్తలను ప్రజల వద్దకు పంపేవీలు కల్గుతూంది.

ఢిల్లీ రాజకీయాలలో తన కీలక పాత్రను నిలబెట్టు కోవడం చంద్రబాబు సాధించిన మరొక విజయం. దేవగౌడ తనం ఖాయమని రుజువైన తర్వాత కూడా డిఎంకె, టిఎంసి వంటి తతిమా ప్రాంతీయ పార్టీలు ప్రక్కచూపులు చూడకుండా నిలువరించడంలో చంద్రబాబు నిర్వహించిన పాత్ర చాలా ప్రాధాన్యత కల్గినది. తన పార్టీ ఎమ్మెల్యేలు సైతం బిజెపికో, కాంగ్రెస్‌కో వలస పోకుండా కూడా జాగ్రత్తపడ్డా రాయన.

మార్చిలో నిర్వహించిన మహానాడుతో చంద్రబాబుకు పార్టీపై పూర్తి నియంతృత్వాధికారం ఏర్పడింది. హరికృష్ణ వంటి అసంతృప్తి జీవుల నందరినీ నల్లిని నలిపేసినట్లు నలిపేశాడు. ఎక్కడి సణుగుళ్లు, గొణుగుళ్లు లేకుండా అణచి పారేశాడు.

రాజకీయాలలో ఇట్లా తలపెట్టిన ప్రతిపనీ సానుకూలం కావడం చాలా అరుదైన విషయం. చంద్రబాబు జాతక మహిమ అది. *

## ఢిల్లీ సంక్షోభంలో ఆంధ్రులదే కీలకపాత్ర!

జాతీయ రాజకీయాలలో ఆంధ్ర నాయకులు కీలకపాత్ర వహించడ మనేది అత్యంత అరుదుగా జరిగే విషయం. స్వాతంత్రోద్యమం ముందు పట్టాభి రామయ్య వంటి వారు; స్వాతంత్ర్యానంతరం నీలం సంజీవ రెడ్డి, కాసు బ్రహ్మానంద రెడ్డి, పివి వంటి ఒకరిద్దరు నేతలు మాత్రమే ఆ అరుదైన గౌరవం పొంద గలిగారు. కానీ ఇప్పటి ఢిల్లీ సంక్షోభంలో ఆంధ్ర నాయకులు ఎంతో ప్రముఖంగా వ్యవహరించ గల్గుతున్నారు. వారిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది ప్రథమ స్థానం. యునైటెడ్ ఫ్రంట్‌లో జ్యోతిబసు, కరుణానిధి వంటి సీనియర్ నేతలు చాలా మంది వున్నప్పటికి - చర్చలు, సంధానాలు, సంభాషణలకు చంద్రబాబు నాయుడినే ముందుకు నెట్టున్నారు అందరూ కలిసి! ఆయన ప్రయత్నం ఫలించిందా, వికటించిందా; ఆయన మాట రాజీ మార్గంలో చెల్లుబాటైందా, చెల్లని కాసైందా అన్నది వేరే విషయం.

కాంగ్రెస్‌కు సంబంధించి మాజీ ముఖ్యమంత్రులు కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి పార్టీ

> చంద్రబాబు, కోట్ల, నేదురుమల్లి, వెంకయ్యనాయుడు; పలువురు ఎమ్పీలు ఇంద్రప్రస్థ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారు

నిర్ణయాలను ప్రభావితం చేయగల్గుతున్నారు. ప్రత్యక్షంగా వారే చర్చలలోనూ లేనప్పటికీ, పరోక్షంగా వారి సలహాలు, సూచనలు కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం కేసరిని ప్రభావితం చేస్తున్నాయి. వారితో మాట్లాడనిదే ఆయన అడుగు ముందుకేయడం లేదు. శరద్‌పవార్ సైతం జనార్ధనరెడ్డి మీద ఆధారపడి వున్నారు.

బిజెపి పార్టీలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహిస్తున్నారు - శ్రీ ఎం. వెంకయ్యనాయుడు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా వాజ్‌పేయ్ సరసన వుండి ప్రతి చర్యలోనూ పాలు పంచుకొంటున్నా రాయన.

తిక్కవరపు సుబ్బరామరెడ్డి, డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి వంటి ఎమ్పీలూ చురుకుగా వ్యవహరిస్తున్నారు. దాదాపు 50 మంది కాంగ్రెస్ ఎమ్పీలను తన ఇంటికి రప్పించి, విందు చేసి, కేసరికి అనుగుణంగా వారిని మలచడంలో సుబ్బరామరెడ్డి సఫలీకృతుడైనాడు.

***




# శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానము

మూలాపేట – నెల్లూరు - 524 003

బ్రహ్మోత్సవ ఆహ్వానము **17.4.1997** నుండి **29.4.1997** వరకు

కార్యక్రమములు

| తేది | వారము | ఉదయం | రాత్రి |
|---|---|---|---|
| 17.4.97 | గురువారం | | అంకురార్పణ |
| 18.4.97 | శుక్రవారం | ధ్వజారోహణము | శేషవాహనము (నెల్లూరు ఉత్సవము) |
| 19.4.97 | శనివారం | సూర్యప్రభ | హంస వాహనము (పేట ఉత్సవము) |
| 20.4.97 | ఆదివారం | యాళి ఉత్సవం సింహ వాహనము | చంద్ర ప్రభ (నెల్లూరు ఉత్సవము) |
| 21.4.97 | సోమవారం | చప్పరము | హనుమంత సేవ (నెల్లూరు ఉత్సవము) |
| 22.4.97 | మంగళవారం | మోహిని (గిన్నెభిక్ష) | గరుడసేవ (నెల్లూరు ఉత్సవము) మూలవర్లకు పూలంగిసేవ |

| తేది | వారము | ఉదయం | రాత్రి |
|---|---|---|---|
| 23.4.97 | బుధవారం | | కళ్యాణము ఏనుగు వాహనము (పేట ఉత్సవము) |
| 24.4.97 | గురువారం | రథము | |
| 25.4.97 | శుక్రవారం | వెన్నెతాళి ఉత్సవము | గుఱ్ఱము వాహనము (పేట ఉత్సవము) |
| 26.4.97 | శనివారం | తీర్థవాది ముసుగులసేవ | పొన్న వాహనము (నెల్లూరు ఉత్సవము) |
| 27.4.97 | ఆదివారం | | అవరోహనము |
| 28.4.97 | సోమవారం | | వడాయత - 1 |
| 29.4.97 | మంగళవారం | | వడాయత - 2 |

ఎ. విద్యార్థి
మేనేజర్

దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు

ఆనం చంద్రశేఖర్ రెడ్డి ట్రస్టీ
తుమ్మల సుబ్బారెడ్డి ట్రస్టీ
మన్నెం లక్ష్మినాధ రెడ్డి ట్రస్టీ
మజ్జిగ చంద్రమౌళీ రెడ్డి ట్రస్టీ

ఆనం వివేకానంద రెడ్డి
మేనేజింగ్ ట్రస్టీ

# కావలిలో బంగారు కొంటే పోలీస్‌ల చేతికి చిక్కినట్లే!

ఎక్కడెక్కడో దొంగలించిన బంగారం అమ్మక కేంద్రంగా కావలి తయారయ్యింది. గత ఆరు నెలల్లో ఇటీవలి కాలంలో పోలీసులు కావలిలో మూడుసార్లు దాడి జరిపి, పెద్ద మొత్తంలో దొంగ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు ప్రాంతం దొంగలు రాష్ట్ర వ్యాప్తంగా దొంగిలించిన బంగారాన్ని కావలికి తెచ్చి అమ్ముతున్నారు. కొందరు దొంగలు ఇందు కోసం తమ కాపురాలే ఇక్కడ పెట్టినట్లు తెలిసింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అనేక దొంగతనాల కేసుల్లో నిందితుడైన నారాయణ ఇటీవల గుంటూరు పోలీసులకు పట్టుపడ్డాడు. తాను రెండు కిలోల బంగారాన్ని కావలిలోని బంగారు వ్యాపారస్తులకు అమ్మినట్లు అతడు చెప్పడంతో పోలీసులు వ్యాపారస్తుల నుండి ఆ బంగారాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి వచ్చారు; అయితే, వారంతా కలసికట్టుగా రాజకీయ నాయకుల పోలీసులతో 'రాజీ' పడి కొద్ది బంగారాన్ని మాత్రం తిరిగి ఇచ్చి తప్పించు కొన్నారు. అప్పటి ఒప్పందం మహిమ కాబోలు – ఆ వ్యాపారస్తులు తతిమా బంగారాన్ని అమాయక జనానికి అమ్మేయడం; ఆ వెంటనే పోలీసులు నగలు కొనుగోలు చేసిన వారి ఇళ్లపై పడి వాటిని స్వాధీనం చేసుకోవడం ఒక పథకం ప్రకారం జరుగు తూంది; వ్యాపారులకు నష్టం జరగ కుండా ఇదొక ఉపాయ మన్నమాట. రాత్రికి రాత్రి లక్షాధికారులు కావాలన్న కావలి బంగారు వ్యాపారస్తుల అత్యాశ కావలి పరువు పోగొట్టు తున్నది. ఇదే ధోరణి కొన్నాళ్లు సాగితే కావలి లోపల ఎవరూ బంగారు నగ కొనరు.

## జిల్లావార్తలు

### శ్రీరామకృష్ణ జన్మోత్సవ సభ

నెల్లూరు శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ పరమహంస 162వ జన్మోత్సవ సభ 18 తేది టౌన్‌హాల్‌లో జరుగు తుంది. రామకృష్ణ మిషన్ చెంగల్పట్టు శాఖ అధినేత స్వామి విరూపాక్షానంద ప్రధాన వక్తగా పాల్గొంటారు. వివేకానంద అభిమానులకు ఆహ్వాన మంద జేస్తున్నారు – సభా నిర్వాహకులు ఎన్‌వి నరసింహ రావు.



డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి స్మృత్యర్థకంగా ఎల్‌బిసి నిర్వహించిన అష్టావధానంలో అవధాని కొండపి మురళీకృష్ణ పృచ్ఛకులు శేషకుమార్, పాయసం సుబ్రహ్మణ్యం, బివి నరసింహం, దుగ్గిశెట్టి వెంకటరమణయ్య

# పుచ్చకాయలు పండిస్తే రైతులకు పడరాని పాట్లే!

వెంకటగిరి ప్రాంతంలో రైతులు ఈ యేడాది పుచ్చకాయల పంటను విస్తృతంగా సాగు చేశారు. కాని ఉత్పత్తికి తగిన మార్కెట్ లేకపోవడం వల్ల అల్లాడి పోతున్నారు. లారీల సమ్మె రైతులను మరింత కృంగ దీసింది. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో దాదాపు 6 వేల ఎకరాల్లో ఈ యేడాది పుచ్చకాయల పంట వేశారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో టన్ను పుచ్చకాయలు సైజును బట్టి 5 వేల నుండి 10 వేల రూపాయల వరకు ధర పలికింది. కాని ఏప్రెల్ నెల ప్రారంభంలో ధర పెరగాల్సింది పోయి ఒక్కసారిగా పడిపోయింది. దీనివల్ల వెంకటగిరి చుట్టుప్రక్కల గ్రామాల్లో ఎక్కడ చూసినా పుచ్చకాయలు దర్శనమిస్తున్నాయి. దీని వల్ల అప్పో, సప్పో చేసి వ్యవసాయం చేసిన రైతులు అల్లాడి పోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

### సూళ్లూరుపేటలో కొబ్బరికాయ రు.15లు

లారీల సమ్మె వల్ల రవాణా స్తంభించి పోవడంతో సూళ్లూరు పేటలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయి. గతవారంలో ఏడు రూపాయలు అమ్ముతుండిన కొబ్బరి కాయ ఒక్కసారిగా 15 రూపాయలకు పెరిగింది. ఎర్రగడ్డలు 4 రూపాయల నుంచి 12 రూపాయలకు చేరగా, వంకాయలు 12 రూపాయలు అమ్ముతున్నారు. కోడి గ్రుడ్లు అసలే దొరకని పరిస్థితి. షార్ ఉద్యోగులు నివసించే కాలనీల్లో పలు నిత్యావసర వస్తువుల ధరలకు పట్టపగ్గాలు లేవు.

# లారీ సమ్మెలో ఆర్టీసి దోపిడీ!

ప్రయాణీకులను రక రకాలుగా దోచుకొనేందుకు కావలి డిపో అధికారులు పథకాలు రచిస్తుంటారు. డొక్కు బస్సులను నడిపి ప్రయాణీకుల ప్రాణం తీసి పొదుపుగా ఇంధనం వాడినట్లు రికార్డు సంపాదించా రిదివరలో. గత వారంలో లారీల సమ్మెను కూడా సొమ్ము చేసుకున్నారు. మామూలుగాదూర ప్రాంతాలకు లగ్జరీ బస్సులు నడుపుతారు. ఈ బస్సులలో చార్జీ ఎక్కువ. సమ్మె వల్ల లారీల్లో ప్రయాణించే వారు కూడా బస్సులను ఆశ్రయించక తప్పలేదు. అది గమనించి కావలి డిపో అధికారులు తెలివిగా తాము నడిపే ఆర్డినరీ, సూపర్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను 10 రోజుల పాటు రద్దు చేశారు. వాటి స్థానంలో లగ్జరీ బస్సులను వేసారు. ప్రజలకు ఈ బస్సులలో ప్రయాణం చేయక తప్పలేదు. కావలి – నెల్లూరుల మధ్య మామూలుగా నడిచే సర్వీసులో 15 రూపాయలు ఛార్జీ అయితే; లగ్జరీ సర్వీసుల పేరిట 22 రూపాయలు వసూలు చేసారు. కుగ్రామాలకు సైతం ఈ పదిరోజుల్లో కొన్ని లగ్జరీ సర్వీసులను నడిపారు. ఈ పది రోజుల అదనపు ఆదాయంతో ఈసారి లాభాల్లో కావలి ఆర్టీసీ డిపో జిల్లాలో ముందు నిలిచినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం ఉండదు. ఆర్టీసి అధికారులు ఈ విధంగా ప్రజలను దోచుకోవడం అన్యాయం.

# ఎక్సైజ్ పోలీసులు దారిదోపిడీ దొంగలుగా మారిపోయారు!

ఆంధ్రా – తమిళనాడు సరిహద్దులోని భీమునివారి పాళెం చెక్‌పోస్టులో ఎక్సైజ్ శాఖ దౌర్జన్యం వర్ణనాతీతంగా ఉంది. రాష్ట్రంలో మద్య నిషేధం అమలులో ఉన్నప్పుడు ఇక్కడి సిబ్బంది జీతానికి పదిరెట్లు లంచం రూపేణా లభించేది. ఇటీవల మద్య నిషేధాన్ని సడలించాక వారి ఆదాయం తగ్గిపోయింది. దీనితో చెక్‌పోస్టులోని సిబ్బంది దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తూ ప్రజలను దోచు కొంటున్నారు. అమాయకంగా కనపడిన వారిని బస్సులోంచి దించి, మద్యం కలిగి ఉన్నట్లు కేసులు పెడతామని భయపెట్టి జేబులో వున్నదంతా లాక్కొంటున్నారు. నాయుడు పేటకు చెందిన ఒక విద్యుత్‌శాఖ ఉద్యోగిని ఇక్కడి సిబ్బంది నాలుగు రోజుల క్రితం ఇదే విధంగా భయపెట్టి 2 వేల రూపాయలు దోచుకొన్నట్లు తెలిసింది. ఎక్సైజ్ పోలీసులకు జీతాలు అనవసరం. ఈ ఎక్సైజ్ పోలీసు లందరి చేతా ఒక యేడాది నక్సల్స్ ప్రాంతాల్లో డ్యూటీ చేయిస్తే బాగుంటుందేమో!

### వివిఓ అయిన టీచర్

ఆత్మకూరు మండలం బోయిన చిరువెళ్ల గ్రామం వివిఓ శేషగిరి సెలవు పెట్టి; రెవిన్యూ రికార్డులు తన మిత్రుడైన, నారంపేటలో టీచర్‌గా పనిచేసే మోహన్ రావు చేతికిచ్చి పోయాడు. ఆయన వాటిని జాగ్రత్త చేయాల్సింది పోయి, తానే వివిఓ అవతారం ఎత్తి, వ్యాపారం ప్రారంభించాడు. రైతులకు పాసు పుస్తకాలు తానే పంపిణీ చేసి 70 వేల రూపాయలకు పైగా దండాడట. ఆ వివిఓ పోతూ పోతూ తెల్ల కాగితాలపై సంతకాలు పెట్టి వెళ్లడంతో, అడిగిన వారికి అడిగిన సర్టిఫికేట్ వ్రాసిచ్చి, విక్రయించడం మామూలై

కొరవ 12 పేజీలో

A LION IN THE CEMENT WORLD

సిమెంటు రంగంలో రారాజు

ప్రియా సిమెంట్

ప్రియదర్శిని సిమెంట్ లిమిటెడ్ వారి ఉత్పాదన

# చంద్రమోహన రెడ్డి గండం గట్టెక్కింది!

మద్య నిషేధం రద్దు వల్ల తనపై ఎటువంటి వత్తిడి వస్తుందో; నెల్లూరుకు వస్తే ఎంతటి ఆందోళనను ఎదుర్కో వలసి వస్తుందోనని మధన పడుతుండిన ఐదు శాఖల మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి హాయిగా వూపిరి పీల్చుకున్నారు. ఏ మాత్రం సందడి, సంక్షోభం లేకుండా; దర్జాగా, రాజా వలె 9 తేది ఉదయం నెల్లూరు వచ్చి, తన నియోజక వర్గంలోని కోడూరుపాడులో సభ పెట్టి మద్య నిషేధం రద్దును సమర్థిస్తూ మాట్లాడి, హైదరాబాదు రైలెక్కా రాయన.

రెండేళ్ల క్రితం మద్య నిషేధ ఉద్యమం ఉధృతంగా జరుగు తున్నప్పుడు ఆ పోరాట కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించాడు చంద్రమోహన రెడ్డి. మద్యాన్ని నిషేధించాలని వూరూరు తిరిగి పాద యాత్రలు చేశాడు. ఎన్టీఆర్‌ను సతీ సమేతంగా నెల్లూరుకు పిలిపించి, వి.ఆర్ హైస్కూలు మైదానంలో బ్రహ్మాండమైన సభ నిర్వహించాడు. ఆ ఉద్యమమే చంద్రమోహన రెడ్డికి జిల్లా స్థాయి గుర్తింపు తెచ్చింది; మద్యం పూర్తిగా నిషేధించే వరకు అవిశ్రాంతంగా పోరాడుతానని; ఈ విషయంలో ఎవరితోనూ రాజీ పడే ప్రసక్తే రాదని భీషణ ప్రతిజ్ఞలు చేశారాయన అప్పుడు.

ఇప్పుడు తాను మంత్రిగా వున్న ప్రభుత్వం మద్య నిషేధాన్ని రద్దు చేయడం చంద్రమోహన రెడ్డికి సంకటమైన విషయం. తాను నెల్లూరుకు, తన నియోజక వర్గానికి వెళ్తే – ఉద్యమ కారులు తనను నిలదీస్తారని భయపడ్డా రాయన. కానీ అటువంటి దేమీ జరగ లేదు. చలోక్తికి కూడా ఎవరూ ఆయన్ను ఆ ప్రశ్న వేయలేదు.

అందువల్లే చంద్రమోహన రెడ్డి అంత సాహసంగా, స్పష్టంగా మద్య



నిషేధం రద్దును సమర్థించ గలిగారు. "నేను నడిపింది సారా వ్యతిరేక ఉద్యమం మాత్రమే. బ్రాందీని నిషేధించడం కష్టం. మా ప్రభుత్వం అప్పటికీ ఎంతో ప్రయత్నం చేసింది. కానీ ఫలుపడ లేదు. మద్యం స్మగ్లర్లు మాఫియా గ్యాంగుల వలె తయారై పోయారు; త్రాగుడు వ్యసనం యధాప్రకారం కొనసాగింది; ప్రభుత్వానికి మాత్రం ఆదాయం పోయింది. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నారు చంద్రబాబు; ఇది ప్రజల క్షేమం కోసం చేసిన నిర్ణయం" అని సమర్థించారు చంద్రమోహన రెడ్డి.

* * *

మద్య నిషేధం రద్దు విషయంలో ప్రజలలో వున్న అసంతృప్తిని; మరీ ముఖ్యంగా మహిళలలో వున్న ఆగ్రహాన్ని ఉద్యమంగా రూపకల్పన చేయడంలో కాంగ్రెస్ వాదులు చతికిల బడ్డారు. ఎన్నికల రాజకీయాలు చేయడం; పదవుల కోసం మంత్రాంగాలు నడపడం తప్ప ప్రజలతో కలిసి, ప్రజా ఉద్యమాలు నిర్వహించే నేర్పు, ఓర్పు ఏ కాంగ్రెస్ వారికి లేవని రుజువై పోయింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇంత సాహసోపేత నిర్ణయం తీసుకొంటే – పత్రికా ప్రకటనలతో నిరసన తెల్పడం తప్ప – ప్రతిఘటించడం చేత కావడం

> మద్య నిషేధం రద్దుపై ఏ రభస జరుగుతుందోనని జంకాడే తప్ప ఏమీ జరగలేదు; నిక్షేపంగా నెల్లూరు వచ్చి, వెళ్లాడు; ప్రశ్నించిన వాడేలేడు!

లేదు వారికి! ఏ జిల్లా స్థాయి నాయకుడూ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. నెల్లూరు టౌన్‌లో ఆనం వివేకానంద రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్

కొరవ 7 పేజీలో


## కృతజ్ఞతాంజలి



స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి

మీరు దివికేగినా
భువిన ఉన్న నన్ను దీవిస్తూనే ఉన్నారు
ఆనాడు కొచ్చిన్ పోర్టుకు
మీరు నన్ను సభ్యుడిని చేస్తే
నేడు మీ అడుగుజాడల్లో నడిచే
మీ అర్ధాంగి "పార్వతక్క" నన్ను
గోవా పోర్టు ట్రస్టుకు సభ్యుడిని చేసి
ఆదరించి– ఆశీర్వదించింది.

నా రాజకీయ అభివృద్ధికి బాట వేస్తున్న పార్లమెంటు సభ్యురాలు

శ్రీమతి మాగుంట పార్వతమ్మ, శ్రీ మాగుంట సుధాకరరెడ్డి
శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శ్రీ పి.వి. ప్రసన్నకుమార్‌రెడ్డి

జిల్లా కాంగ్రెస్ ప్రముఖులకు, మిత్రులకు,
నా హృదయపూర్వక కృతజ్ఞతాసుమాంజలి



పత్తి రవీంద్రబాబు
ట్రస్టీ- మార్మగోవా పోర్టుట్రస్టు


## జిల్లావార్తలు

ఐదవ పేజీ కొరవ

పోయినట్లుంది. గ్రామంలో కొత్తగా పదిమందికి పట్టాలూ పంచారట. ఆ భూమి తమకిది వరకే పట్టా ఇచ్చి వున్నారని ముగ్గురు గ్రామస్తులు వెళ్లి ఎమ్మార్వోకు మొర పెట్టుకొన్నా ఫలితం లేదు. వివిటగా పరకాయ ప్రవేశం చేసిన ఈ టీచరుకు ఒక మాజీ ఎమ్మెల్యే అండ వుండడంతో అతడి ఆట సాగుతున్న ట్లుంది; ఎమ్మార్వో సైతం ఆ రాజకీయ ఒత్తిడితో వూరకుండి పోతున్నారట. ఆర్‌డిఓ గారూ – మీరైనా విచారించి, ఈ ఆటలు కట్టించండి.

### వెంకటగిరిలో కిసాన్‌మేళా

వెంకటగిరి మండలం పెట్లూరు నిమ్మ పరిశోధనా కేంద్రంలో 6 తేది కిసాన్ మేళా జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం.వి. రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవలసిన దురదృష్టకర పరిస్థితి నుంచి దేశం తప్పించుకొని, ఎగుమతి చేసే స్థాయికి నేడు ఎదిగిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవడం ద్వారానే రైతులు తగినంత గిట్టుబాటు ధర పొందగలరన్నా రాయన. అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులు అమ్మనందు వల్ల, ఏటా 19 వేల కోట్లు నష్టపోతున్నట్లు వివరించారు. కిసాన్ మేళాలో వెంకటగిరి ఎమ్మెల్యే వివిఆర్‌కె యాచేంద్ర, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కెఎల్ రావు, వి సత్యనారాయణ, చెంచు రెడ్డి ప్రసంగించారు.

### చేతి వృత్తుల వారికి పరికరాల పంపకం

వెంకటగిరి మండలంలోని 83 మంది గ్రామీణ చేతివృత్తుల కుటుంబాల వారికి వివిధ పరికరాలు పంపిణీ చేశారు. 4 తేది మండల పరిషత్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు కడప బ్రహ్మయ్య చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. వడ్రంగి పనిచేసేవారు 41 మంది, కంసాలీలు 7 మంది, చెప్పులు కుట్టేవారు 14 మంది, చాపలు నేసేవారు 7 మందికి, బంగారు పనివారు 8 మంది, బుట్టలల్లే రెండు కుటుంబాలకు ఈ సహాయం అందజేశారు. ఒక్కొక్కరికి అందజేసిన ఈ పరికరాల విలువ 2 వేలని ఎమ్డీఓ శ్రీనివాస రావు చెప్పారు.

### జన్మభూమి అవార్డుల ప్రదానం

జన్మభూమి తొలివిడత కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ సేవలందించిన వారికి వెంకటాచలం మండలాభివృద్ధి కార్యాలయంలో అవార్డులు ప్రదానం చేశారు. మండలంలో ఉత్తమ సంధానకర్తగా కందలపాడు వివిఓ సర్వేపల్లి సుబ్బారావును ఎంపిక చేసి గోల్డ్ మెడల్ అందించారు. ఉత్తమ పంచాయితీగా నిడిగుంటపాళెంను ఎంపిక చేసి సర్పంచ్‌కు ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్డీఓ రంగనాథం, ఎమ్మార్వో కె. నాగభూషణం పాల్గొన్నారు.

### రమణ మహర్షి వర్ధంతి

కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆశ్రమంలో మహర్షి 4వ వర్ధంతి 15 తేది జరుగుతుంది. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆధ్యాత్మిక సభ నిర్వహిస్తున్నారు. సభలో పోలూరి హనుమ జ్ఞానకిరామ శర్మ, కృష్ణానంద స్వామి, రామయ్య శెట్టి, రామచంద్రా రెడ్డి ప్రసంగిస్తారు. సభానంతరం త్యాగరాజ కృతుల కచ్చేరి జరుగు తుంది. ఇలపావులూరి కామేశ్వర రావు, పినాకపాణి, కె. ఈశ్వర రావు, అనంతసాయి, కిరణ్మయి, నృసింహ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు ఎన్. గోపాల రెడ్డి చెప్పారు.